# దేవుడూ..ఈ అమ్మని తీసికెళ్ళద్దేం!

జానకీ జాని

జానకమ్మ ఐదేళ్ళ మనవడి చేత గోరుముద్దలు తినిపిస్తోంది. అన్నం తింటూ ఆనంద్ ''మామ్మా'' అన్నాడు.

''ఏం నాన్నా''

''అమ్మని చూడాలని వుంది. నన్నొదిలిపెట్టి ఎక్కడికెళ్ళింది?''

''అమ్మని దేవుడు తీసికెళ్ళాడు నాన్నా''

''ఎందుకు?''

''దేవుడికి మీ అమ్మంటే ఇష్టం. అందుకని తీసికెళ్ళాడు''

''ఐతే నేనూ దేవుడి దగ్గిరికెళ్ళనా?''

''ఛా, అల్లాంటి మాటలు మాట్లాడకూడదు నాన్నా''

''మరి నాకు అమ్మ కావాలి ఎలా?''

''మీ నాన్న ఇంకో అమ్మని తీసుకొస్తాడు''

''ఎప్పుడు?''

''త్వరలోనే తీసుకు రమ్మని చెబుదాం''




ఇలాంటి ప్రశ్నలు ప్రతి రోజూ వేస్తున్నాడు ఆనంద్. జానకమ్మ, రాఘవరావు, వాడికేం చెప్పాలో తెలీక సతమతమైపోతున్నారు. సుమారు ఏడాది కావస్తోంది హృద్రోగంతో రజని వెళ్ళిపోయి.

ఇంక రవి విషయం చెప్పనే అక్కర్లేదు. మనిషి బాగా కృంగిపోయాడు. ఆఫీసుకి వెళ్ళొస్తున్నాడన్న మాటేగాని పనులన్నీ నిరాసక్తంగా, యాంత్రికంగా చేస్తున్నాడు. మూడు పదుల వయస్సులో రవికి ఈ కష్టం రావటం రాఘవరావు, జానకమ్మ తట్టుకోలేకపోతున్నారు.

ఎన్నోసార్లు ''మళ్ళీ పెళ్ళి చేసుకో నాన్నా'' అంటే ''అమ్మా, మీరా మాట ఎత్తద్దు. అది జరగని పని, నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటే నాకు భార్య వస్తుందిగాని ఆనంద్‌కి తల్లిమాత్రం రాదు. నేను ప్రాణాలన్నీ వాడి మీదే పెట్టుకు బ్రతుకుతున్నాను. పెళ్ళి చేసుకుని ఆనంద్‌కి అన్యాయం చెయ్యలేను'' అనేవాడు.

ఉన్న ఒక్కకొడుకూ ఇలా అయిపోయినందుకు కుమిలిపోవటం తప్ప ఆ ముసలి దంపతులేమీ చెయ్యలేకపోయేవారు. అలాగని బొమ్మలూ, ఆటవస్తువులూ కొని పెట్టి ఆనంద్ తల్లిని మరిచిపోయేలా చెయ్యాలంటే వాళ్ళకి సాధ్యం కావటం లేదు.

ఒక రోజు ఆనంద్ ''మామ్మా, రోజూ అనిల్‌ని వాళ్ళమ్మ స్కూలుకి తీసుకొచ్చి దిగబెడుతుంది'' అన్నాడు.

''నాన్నా రేపటినుంచీ నీకు ప్రత్యేకంగా రిక్షాపెట్టి నేను వచ్చి స్కూలు దగ్గర దిగబెడతాగా''

''వద్దు మామ్మా, నాకు అమ్మ కావాలి. నాన్నని తొందరగా ఇంకో అమ్మని తీసుకు రమ్మను.''

''అలాగే నాన్నా'' కళ్ళొత్తుకుంటూ అంది జానకమ్మ.

రజని పోయి సరిగ్గా ఏడాదయింది.

రాఘవరావు మనవడితో "నాన్నా ఆనంద్ రేపు మీ అమ్మ వస్తుందిరా!" అన్నాడు.

"తాతా నిజంగా వస్తుందా?"

"నిజం నాన్నా"

తెల్లారిందగ్గర నుంచీ గుమ్మంకేసీ చూస్తూ కూచున్నాడు ఆనంద్. ఎవరో ఇద్దరు బ్రాహ్మలు వచ్చారు. హాల్లో మధ్య మంటపెట్టారు. నాన్న పంచె కట్టుకుని వాళ్ళు చెయ్యమన్నదల్లా చేస్తున్నాడు. కొంత సేపటికి వాళ్ళు అన్నం తినేసి వెళ్ళిపోయారు. ఆనంద్‌కి నిరాశ కలిగింది.

"తాతా అమ్మ వస్తుందన్నావుగా రాలేదేం"

"వచ్చింది నాన్నా ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోయింది"

"నాతో మాట్లాడకుండా వెళ్ళిపోయిందా? మళ్ళీ రాదా?"


ఆనంద్ కళ్ళనిండా నీళ్ళు. కళ్ళు తుడుచుకుంటూ ఏడుపు మొదలుపెట్టాడు.

"నీకోసం గార్లు చేశాను నాన్నా పెట్టనా?"

"నాకు గార్లొద్దు. అమ్మ కావాలి"

రోజూ ఆనంద్ మాటల్ని చెప్పి రవిని పెళ్ళి చేసుకోమని పోరుతున్నారు రాఘవరావు దంపతులు. రవి ససేమిరా అనటంతో వాళ్ళు విధిని తిట్టుకోవటం మినహా ఏమీ చేయలేకపోతున్నారు. వాళ్ళకీ తెలుసు. రవి ఈ కాలపు కుర్రాళ్ళ లాంటివాడు కాడు. కొలీగ్సంతా మందు పార్టీలు చేసుకుని పిక్నిక్స్‌కి వెడుతుంటే రవి మాత్రం రామకృష్ణ మిషన్‌కి వెళ్ళి యోగా, ధ్యానం నేర్చుకునేవాడు.

"రవి మనతో కలవడు. అతనికి అకాల వార్ధక్యం" అనుకునే వాళ్ళు అతని సహోద్యోగులు. ఆ ఆఫీసులో రవిని, రవి మాటల్ని, అతని ప్రవర్తనని చూస్తూ ఆశ్చర్యానికి లోనయ్యేది స్టెనోటైపిస్ట్



సుహాసిని. ఆమె రవిని ఎంతో గౌరవంతో చూసేది. రవికి భార్యా వియోగం కలగటం, ఒక్కగానొక్క కొడుకు ఆనంద్ తల్లిని మరచిపోలేక బాధపడుతుండటం ఆమెకు తెలుసు. లంచ్ బ్రేక్‌లో కొలీగ్సందరూ కేంటీన్‌కి వెళ్ళిపోతే ఆ ఆఫీసులో లంచ్ బాక్సులు తెచ్చుకుని భోజనం చేసేవాళ్ళు వీళ్ళిద్దరే. మాటల సందర్భంలో రవి తన సమస్యలన్నీ సుహాసినికి చెప్పేవాడు.

సుహాసిని, "రవిగారూ మన చేతుల్లో ఏమీ లేదు. అంతా ఆ దైవమే నడిపిస్తాడు. ఐనా మానవ ప్రయత్నం మనం మానకూడదు గదా! దేవుడి మీద భారం వేసి మన ప్రయత్నం మనం చెయ్యాలి. మీకు చెప్పదగ్గదాన్ని కాదుకాని మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే మంచిదేమో ఆలోచించండి."

ఈ మాటలు విని రవి ఒక నిట్టూర్పు విడిచేవాడు. కొంత కాలం నిశ్శబ్దంగా గడిచాక "నా అభిప్రాయం మా అమ్మానాన్నలకి చెప్పాను సుహాసిని గారూ. అదే మీకూ చెబుతున్నాను. నేను పెళ్ళి చేసుకుంటే నాకు భార్య వస్తుందిగాని ఆనంద్‌కు తల్లి మాత్రం రాదు. అంతే కాదు. అలా పెళ్ళి చేసుకుంటే నాకు మరిన్ని సమస్యలెదురౌతాయి. మళ్ళీ పెళ్ళంటే పెనం మీంచి పొయ్యిలోకి పడటమే."

సుహాసినికి అతని మాటల్లో నిజం లేకపోలేదనిపించింది. లంచ్ అవర్ పూర్తి కావటంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

మర్నాడు మళ్ళీ లంచ్ అవరల్లో సుహాసినిని రవి అడిగాడు. "నా సంగతి సరే. మీకూ పాతికేళ్ళున్నాయిగదా, మీరెందుకు పెళ్ళి చేసుకోలేదు?"

ఊహించని ఈ ప్రశ్నకి సుహాసిని నివ్వెరపోయి "నా కథంతా రేపు చెబుతాను రవిగారూ. నాకు మీకంటే ఆత్మయులెవరున్నారు?" అంది.

రవికి సుహాసిని ఏం చెబుతుందా అని ఉత్కంఠ ఎక్కువైంది. ఐనా పైకి కనపడనీయకుండా మామూలుగా ఉన్నాడు. మళ్ళీ లంచ్ అవర్‌లో సుహాసిని మొదలుపెట్టింది. రవి ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాడు.

"రవిగారూ ఈ దేవుడున్నాడు చూశారూ, ఆయనో చిలిపి పిల్లాడు. అల్లరి విపరీతంగా చేసే పిల్లాడిలాంటివాడు. పలక మీద బలపంతో ఎన్నో గీతలు గీస్తాడు. అన్నీ వంకర టింకర గీతలే. ఒక్కటీ సరిగ్గా రాయడు. కొన్ని గీతాల్ని రాస్తూనే చెరిపేస్తాడు. తిక్కపుడితే పలక పగలగొట్టి కొత్త పలక కోసం ఎదురుచూస్తాడు."

"నాకేం అర్థం కావటం లేదు. ఇదేదో కవిత్వంలా వుంది" అన్నాడు రవి.

"కవిత్వం కాదు రవిగారూ ఇదొక కఠోర సత్యం. లోకంలో బాధలు లేకుండా సుఖపడుతున్న వాళ్ళున్నారంటారా? ఒకరిది ఒకరకమైన కష్టం. వేరొకరిది ఇంకో రకమైన బాధ. అందుకనే ఆదిశంకరులు- లోకం శోక హతంచ సమస్తం - అన్నారు. ఇదే భావాన్ని థామస్ హార్డీ అనే ఆంగ్ల నవలా రచయిత Happiness is but an occassional episode in the general drama of pain అన్నాడు.

సుహాసినికున్న పరిజ్ఞానం రవిని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది.

"ఐతే సుహాసినిగారూ ఇంతకీ మీరేం చదివారు?"

"నేనా BA లో తెలుగు లిటరేచర్, MA లో ఇంగ్లీష్ లిటరేచర్"

"అమ్మ బాబోయ్ ఇన్ని క్వాలిఫికేషన్స్ ఉండి స్టెనోగా పనిచేస్తున్నారా?

"ఏం చేస్తాం రవిగారూ నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తున్న రోజుల్లో ఈ చిరుద్యోగమే నాకు శ్రీరామరక్ష. సరే అసలు సంగతికి వస్తాను. పదేళ్ళ క్రిందటి వరకూ - అంటే నాకు పదిహేనేళ్ళు వచ్చే వరకూ నేను వ్యక్తురాలిని కాలేదు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయిన నన్ను మా మేనమామ చేరదీసి ఎంతో ప్రేమతో పెంచాడు. ఆయనకి సంతానం లేకపోవటంతో మామయ్య అత్తయ్య నన్ను ఎంతో ప్రేమగా కాలు కింద పెట్టనీకుండా పెంచారు. పదిహేనేళ్ళు వచ్చినా వ్యక్తురాలిని కాకపోవటంతో మామయ్య ఒక పెద్ద గైనకాలజిస్ట్ దగ్గిరికి నన్ను తీసుకెళ్ళాడు. అన్ని పరీక్షలూ చేసి ఆవిడ చెప్పిన మాటలు విన్న నాకు నెత్తిన పిడుగు పడినట్లయింది.

"మీ అమ్మాయికి స్త్రీత్వ లక్షణాలన్నీ సరిగానే ఉన్నాయి. సంసారానికే ఇబ్బందీ రాదు. కాని ఇంత అందం ఇచ్చిన భగవంతుడు అమ్మాయికి గర్భకోశం లేకుండా చేశాడు. అంచేత ఈ పిల్లకి పెళ్ళి చేసినా సంతానం మాత్రం కలగదు."

"రవిగారూ ఆ మాటలు విన్ననాకు ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. ఏ స్త్రీకైనా మాతృత్వం ఒక వరం. పిల్లలని కనాలనీ, వాళ్ళకి గోరుముద్దలు తినిపించాలనీ, వాళ్ల ఆటపాటలు చూసి ఆనందించాలని ఏ స్త్రీయైనా కోరుకుంటుంది. భగవంతుడు నాకు ఎంతో అన్యాయం చేసాడు. అందుకే నేనన్నాను. దేవుడు చిలిపి పిల్లాడని. నా విషయంలో వంకర గీతే గీశాడు.

సుహాసినికి దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. ఆమె ఏడుపు చూసి చలించిపోయాడు రవి.

ఎలా ఓదార్చాలో తెలియక ఖిన్నుడైపోయిన రవి, "నన్ను క్షమించండి సుహాసినీ. ఇంత మానసిక క్షోభ అనుభవిస్తూ పైకి ఎంత ప్రశాంతంగా వుండగలుగుతున్నారో నేను ఊహించలేకపోతున్నాను. కంఠంలో హాలాహలం దాచి తల నుంచి గంగాజలం కురిపించే పరమేశ్వర తత్త్వమేదో మీలో ఉంది. మీరు దుఃఖం దిగమింగుకోండి. నాకేమీ చెప్పొద్దు. అయామ్ వెరీ సారీ నన్ను క్షమించండి."

ఈ మాటలంటున్నప్పుడు రవి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

మర్నాడు సుహాసిని రవితో అంది "నేనెవరైనా పిల్లాణ్ణి పెంచుకుందామనుకుంటున్నాను రవిగారూ. కంటేనే అమ్మ అవుతుందా? కృష్ణుణ్ణి పెంచిన యశోద తల్లి కాకుండా పోతుందా" అంది. ఈ మాటలు రవిని బాగా ఆలోచింపచేసాయి.

రాత్రి రవికి నిద్ర రాలేదు. తను సుహాసినిని పెళ్ళి చేసుకుంటే ఎలావుంటుందన్న ఆలోచన మనసులోకి వచ్చింది. సుహాసినిని పెళ్ళి చేసుకుంటే ఆనంద్‌కి నిస్సందేహంగా మంచి తల్లి లభిస్తుందనిపించింది రవికి. తల్లిదండ్రులకి సుహాసిని కథంతా చెప్పి తన అభిప్రాయం తెలియజేశాడు రవి. రాఘవరావూ జానకమ్మా ఇది మంచి పరిష్కారమే అనుకున్నారు. ఇంతకీ సుహాసిని ఒప్పుకోవాలిగదా. ఒప్పుకుంటుందో లేదో అనే సంశయం రవి మనస్సుని దొలిచివేసింది. ధైర్యం చేసి సుహాసినిని అడిగేశాడు రవి.

"సుహాసినిగారూ మీరు ఓ పిల్లాణ్ణి పెంచుకుని తల్లి కావాలనుకుంటున్నారు గదా. తల్లి లేదని నిత్యం బాధపడుతున్న మా ఆనంద్‌కి తల్లిగా వుండకూడదా! నా సంగతలా వుంచి ఆనంద్ కోరికా మీ కోరికా నెరవేరుతాయి. మా అమ్మానాన్నా కూడా సంతోషిస్తారు. మా చీకటింట్లో ఓ దీపం వెలుగుతుంది. ఈ విషయం మీరు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. మీకు ఇష్టం లేకపోతే ఈ విషయం ఇక్కడితో వదిలేద్దాం" అన్నాడు.

ఏ మాత్రం ఊహించని సంఘటన సుహాసిని

కవిత



## అక్షరకాంతిలో....

ఆత్మీయంగా,
మిత్రుడొకరు తన కొత్త పుస్తకాన్ని
కోరికోరి పంపాడు...
ముఖచిత్రంపై
ఓ చూపు విసిరి
అద్దాల వెనక దాన్ని భద్రంగా దాచాను.
ఉత్సవ విగ్రహాల్లా పుస్తకాల దొంతరలు..
పెరుగుతున్న సంఖ్యను చూసి
పెదవంచులపై చిట్లిన దరహాసం...

***

అర్ధరాత్రి ఏదో అలికిడి...
చీకటి కళ్ళలోయల్లోకి దూకిన
వెలుగుల నయాగరా...
ప్రతి పుస్తకమొక కాంతివలయమై
అక్షర కిరణాల్ని ప్రసరిస్తోంది...
గుండెలో ఏదో అలజడి...
గది నిండా దివ్యజ్యోతుల హడావిడి...

***

తెల్లారింది.
ఆత్రంగా ఓ పుస్తకాన్ని
ఆర్తిగా తెరిచాను...
రాత్రినే కాదు...
అది నా అంతరంగాన్ని కూడా
వెలిగించింది...!!

-సంగెవేని రవీంద్ర, ముంబై
సెల్: 099871 45310

మనస్సరోవరంలో ఓ రాయి విసిరింది.

ఆలోచనల సుడిగుండంలో చిక్కుకున్న సుహాసిని ''రవిగారూ నాకు రెండో రోజులు వ్యవధివ్వండి తరువాత నా అభిప్రాయం చెబుతాను'' అంది.

ఈ రెండు రోజులూ రవికీ, సుహాసినికీ రెండు యుగాలయ్యాయి.

మూడో రోజు సుహాసిని నేలవంక చూస్తూ ''రవిగారూ మీ ఇష్టమే నా ఇష్టం'' అంది.

రవి ఓ మంచి రోజు చూసి ఆర్భాటం లేకుండా సుహాసినిని రిజిస్టర్ మేరేజ్ చేసుకుని ఇంటికి తీసుకువచ్చాడు. అంతకు ముందే నీకు ఇంకో అమ్మ వస్తుందని చెప్పటంతో ఆనంద్ ఉత్సాహానికి అవధుల్లేవు. రవి, సుహాసిని ఇంట్లో అడుగుపెడుతుంటే జానకమ్మ దిష్టి తీసి హారతిచ్చింది.

కుడికాలు పెట్టి ఇంట్లో ప్రవేశించినా సుహాసిని ఆనంద్‌ని చూసి ''రా నాన్నా'' అంది.

ముందు కొంత సంకోచించినా సుహాసిని చేతులు చాపటంతో ఒక్క ఉదుటున ఆమె వొళ్ళో వాలిపోయాడు ఆనంద్. సుహాసిని ఆనంద్‌ని కౌగిలించుకుంటుంటే రవి కళ్ళు ఆనందంతో, సంతృప్తితో మెరిసిపోయాయి.

వారం తిరిగిందో లేదో సుహాసినికి ఆనంద్ ఎంతో చేరికైపోయాడు. తనని స్నానం చేయించి బట్టలు కట్టి స్కూలులో దిగబెట్టేది జానకమ్మ. ఆ పనులన్నీ ఇప్పుడు సుహాసినే చేయాలంటున్నాడు ఆనంద్. జానకమ్మకి ఈ పరిణామం ఎంతో సంతోషం కలిగించింది. ఆనంద్‌కి తల్లి లభించినందుకు జానకమ్మ అవధిలేని ఆనందాన్ని పొందింది.

సుహాసిని రవితో ''రవిగారూ నేను ఉద్యోగానికి రాజీనామా చేసేస్తాను'' అంది.

రవి ఆశ్చర్యపోయి ''ఇప్పుడంత అవసరమేముంది?'' అన్నాడు.

''ఉందండీ. తల్లి పని పార్ట్ టైమ్ జాబ్ కాదు. అది ఫుల్ టైమ్ జాబ్. ఈ జాబ్‌లో కలిగే సంతృప్తి అంతా ఇంతా కాదు. ఐనా తుది నిర్ణయం మీదే'' అంది.

ఈ మాటలు విన్న రవి సంతోషం ఎవరెస్టుని అధిరోహించింది.

''అది సరేకాని మీరు నన్ను రవిగారూ అనే పిలుస్తారా'' అన్నాడు.

సుహాసిని ''ఏమండీ ఇక నుంచి అలా పిలవనులెండి. మీరు కూడా నన్ను 'సుహాసినీ' అనే పిలవండి'' అంది.

సుహాసిని ఉద్యోగానికి రాజీనామా చెయ్యటానికి రవి అంగీకరించాడు. ఇప్పుడా ఇంట్లో ప్రశాంతత చోటు చేసుకుంది. సుహాసిని జానకమ్మకీ రాఘవరావుకి తలలో నాలుక అయిపోయింది. సుహాసిని పొద్దున్నే ఆనంద్‌ని స్కూలు కెళ్ళటానికి తయారు చేసి స్కూల్ దగ్గర దింపి వచ్చేది. ఆ తరవాత అత్తగారికి వంట పనిలో సహాయం చేసేది.

ఉద్యోగానికి రిజైన్ చేసి ఇంటి పట్టునే వుంటున్న సుహాసిని ఓ రోజు జానకమ్మతో అంది ''అత్తయ్య గారూ ఇంక మీరు వంటింటి ఛాయలకి రాకండి. హాయిగా విశ్రాంతి తీసుకోండి. ఆ పనంతా నేను చేస్తాను.''

కోడలు మాటలు విన్న జానకమ్మ సంతోషానికి అవధుల్లేవు. ఆనంద్‌ని క్రమశిక్షణతో పెంచాలని రోజూ స్కూలుకెళ్ళేముందు ఐదు నిమిషాలు శ్రీరామచంద్రుడి పటం ముందు కూచుని ప్రార్థన చేయటం అలవాటు చేసింది.

''నాకు బాగా చదువు రావాలని దేవుణ్ణి ప్రార్థించు నాన్నా'' అన్న సుహాసిని మాటలు విని ఆనంద్ తల వూపాడు.

మర్నాడు ఆనంద్‌ని స్కూలు దగ్గర దింపటానికి సిద్ధమైంది సుహాసిని. దేవుడి గదిలో రాముడి పటం ముందు కూచుని ప్రార్థన చేస్తున్న ఆనంద్ బిగ్గరగా ఏదో అంటున్నాడు. ఏంకోరుకుంటున్నాడో వినాలని వెనకే నుంచున్న సుహాసినికి ఆనంద్ మాటలు స్పష్టంగా వినిపించాయి.

వాడు ''దేవుడూ ఈ అమ్మని నీ దగ్గరికి తీసెకెళ్ళొద్దేం'' అని దణ్ణం పెడుతున్నాడు.

*

రచయిత ఫోన్ నెం: *0884-2374975*

## మనమీదేసర్రోయ్!

సరసి

